# పున్నమి వెన్నెల

అర చేతిలో పాదరసంలా -వెంకటేశం మనసు పత్రిక మీద నిలవడంలేదు. గుండెనిండా వెన్నెల కదలాడుతోంది. మేలిమి బంగారు చెక్కిళ్ళు, తీర్చిదిద్దిన కనుబొమ్మలు, కువకువలాడే వయసు సొగసులు... వారం రోజుల క్రితం వెన్నెల జాయినవగానే ఆఫీసుకే కొత్త అందమొచ్చింది. తన ఎకౌంట్స్ సెక్షన్‌కే అలాటైంది. ఆకాశంనుండి దిగితున్న అందాల తారలా అడుగులో అడుగేస్తూ వయ్యారంగా వచ్చింది.

"నమస్కారమండీ అకౌంటెంట్ గారూ!" తనను కమ్మగా పలకరించింది.

అప్పుడామె కళ్ళు అలవోకగా కదుల్తూంటే లక్షల రూపాయల అరియర్స్ దొరికినంత ఆనందమన్పించింది.

కొత్తగా రిక్రూటై వచ్చిన కుందనబ్బొమ్మకు ఉద్యోగం కొత్త పనికొత్త... తనకో సువార్ణావకాశం. పక్క సీట్లోనే కూర్చోబెట్టుకున్నాడు.

డౌట్స్ క్లియర్ చేస్తూ ఆమె కళ్ళలోకి సూటిగా చూడాలని ఎన్నిసార్లు ప్రయత్నించినా కుదరలేదు. జూకాల లావణ్యం తప్ప పెదాల కదలిక కనబడనీయలేదు. కళ్ళు కాయితాని కప్పజెప్పి చెవులు, తనకప్పజెప్పేది. కాని.... ఈ రోజు మాత్రం లంచవర్లో ఒంటరిగా కలిసింది. గలగలా నవ్వుతూ మాట్లాడింది

రాత్రి ఎనిమిదింటికి తన ఇంటి డాబా పైకి డైరెక్ట్‌గా రమ్మంది. ఆ రోజు నిండు పున్నమి.

వెన్నెలలో వెన్నెలతో ఆహా! అదృష్టమంటే తనదే

లాంగ్‌బెల్ మోగింది. లైబ్రరీ మూసేస్తున్నారు. అంటే ఎని మిదైందన్న మాట, గబగబా బయటికొచ్చేసి ఆటో ఎక్కేసి విద్యానగర్లో దిగాడు

నిండు పున్నమి వెన్నెల-మచ్చలేని తెల్లని మఖ్మల్ గుడ్డలా డాబానింగా పరుచుకుంది

ఆకుపచ్చ చీర, తెల్లని జాకెట్టు, జడనిండా మల్లెలు .. వెన్నెల అటు తిరగి ఆకాశం పైపు చూస్తోంది.

పాపం! తనకొరకే ఎదురు చూసోన్నటుంది. వెంకటేశం మనోసాగరంలో కొంటె కోర్కెల రాయంచ ఖుషీగా రెక్కలాడించింది

పిల్లిల్లా వెళ్ళడం. నడుము చుట్టూ చేతులేసి గట్టిగా అదుముకోవడం... క్షణంలో జరిగిపోయినై. చెంప ఛెళ్ళుమంది గుండె ఝల్లు మంది.

ఆమె...

వెన్నెల కాదు.... పూర్ణిమ ... తన భార్య పూర్ణిమా. అబ్బా...చెంప మండిపోతోంది.

"అరెరే... మీరా! ఎవడో అనుకున్నరండీ!" పూర్ణిమ కనురెప్పలు పూల మీది తుమ్మెద రెక్కల్లాటపటపలాడినై.

"ఆ నేనే! నువ్వెందుకొచ్చావిక్కడికి?" అందోళన.

"వెన్నెల నా పాత స్నేహితురాలు. అది ఈ ఊరు వచ్చే ముందు నాకుత్తరం రాసి మన అడ్రసు కనుక్కొంది. సాయంత్రం మనింటికొచ్చి నన్నిటులాక్కొచ్చింది." అదిప్పుడే కిందికెళ్ళింది.

"అలాగా....!" కొండవీంచి జారి కోనేట్లో పడిపోయినట్టనిపించింది వెంకటేశంకు.

(అమృత్‌కిరణ్)